రక్తదానం.. సర్టిఫికెట్ అందజేత



రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ విమోచన వేడుకలు, ప్రధాని మోడీ జన్మదినాలను పురస్కరించుకుని బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి సర్టిఫికెట్ అందుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నేత నర్సింగ్‌గౌడ్

దుండిగల్: వినాయక నిమజ్జనం సందర్భంగా దుండిగల్ మోతి చెరువులో నిమజ్జనం చేస్తుండగా ఆటోతో సహా చెరువులో మునిగి మృతి చెందిన వారి కుటుంబానికి బీజేపీ నాయకుడు ఎల్.నర్సింగ్‌గౌడ్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చెరువులో మునిగి మృతి చెందిన శ్రీనివాసు కుటుంబాన్ని బుధవారం పరామర్శించిన నర్సింగ్‌గౌడ్ రూ.85వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, శాంతకుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం!



కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల డివిజన్ అంగడిపేట గ్రామంలోని వీధిలో విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో అధికారులు ఇక్కడ వచ్చి పరిశీలించి వెళ్లారు. కానీ కూలడానికి సిద్ధంగా ఉన్నా విద్యుత్ స్తంభాన్ని మాత్రం మార్చలేదని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు భారీ వర్షాలు, మరోవైపు ఈదురు గాలులు తరుణంలో ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదం జరగకముందే స్తంభాన్ని తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. పేట్ బషీరాబాద్ విద్యుత్ ఏఈ జ్ఞానేశ్వర్‌ను వివరణ కోరగా.. గతంలో విద్యుత్ స్తంభం తొలగించే ప్రక్రియ చేపట్టి పక్కనే గోతులు తవ్వితే స్థానికులు అడ్డుతగిలారని, ఎవరైనా వచ్చి అక్కడ బాధ్యత తీసుకొని నిలబడితే తప్పకుండా విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని వేస్తామని పేర్కొన్నారు.

తాగునీటితో ట్యాంకర్ల క్లీనింగ్!



చింతల్: వడ్డించేవాడు మనవాడైతే ఏ మూలన కూర్చున్నా గాని రాచ మర్యాదలు దక్కుతాయన్న సామెతలు కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ సిబ్బంది నిజం చేస్తున్నారు. షాపూర్‌నగర్ రిజర్వాయర్ పంపింగ్ వద్ద ఉన్న వాటర్ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ పాయింట్ వద్ద కొంతమంది ట్యాంకర్ల యజమానులు, సిబ్బంది ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారు. ట్యాంకర్ల బుకింగ్ ఇటీవల తగ్గిపోవడం, ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాటర్ ట్యాంకర్లు బురద మయంగా మారాయి. దీంతో సదరు టాంకర్ల సిబ్బంది వాటర్ ట్యాంకర్ ఫీలింగ్ పాయింట్ వద్ద గోదావరి జలాలతో కడుగుతున్నారు. దీంతో వందలాది కిలోమీటర్ల నుంచి తీసుకువచ్చిన గోదావరి జలాలను వృథా చేస్తున్నారు.

వివాదంలో శ్మశానవాటిక స్థలం!

ఓ వైపు ప్రభుత్వం శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నామని చెబుతుంది. కానీ ప్రగతినగర్‌లో మాత్రం ఈ పరిస్థితి భిన్నంగా ఉంది. 25 సంవత్సరాలుగా ప్రగతినగర్ వాసులు అంబీర్ చెరువు సమీపంలో శ్మశాన వాటికను ఏర్పాటు చేసుకుని అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులు వచ్చి సదరు స్థలం తమదంటూ వాదిస్తున్నారు. చివరి యాత్రకు కూడా చోటు లేకపోవడం ఎంత బాధాకరమో ఊహించుకోండి. అదే పరిస్థితి ప్రస్తుతం ప్రగతినగర్ ప్రజలది.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రగతినగర్ వాసులు(ఫైల్)



శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్(ఫైల్)

- స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్
- రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదు
- స్థలం తమదంటూ కోర్టుకెళ్లిన ఓ నిర్మాణ సంస్థ
- ప్రగతినగర్ వాసుల చివరి మజిలి కష్టాలు

నిజాంపేట్ : లక్ష మందికి పైగా జనాభా ఉన్న ఈ ప్రాంతంలో అంత్యక్రియలకు ప్రత్యేకమైన శ్మశాన వాటిక లేదు. ఇది స్థానికులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. లక్షలాది రూపాయల నిధులతో నిర్మించిన షెడ్లు, డీఆర్‌సీ సెంటర్‌ను ధ్వంసం చేసి, ఆ స్థలాన్ని చెత్త డంపింగ్ యార్డుగా మార్చేశారు. అంతిమయాత్రల కోసం సౌకర్యాలు లేని ప్రజలు ఎక్కడికక్కడ తాత్కాలిక ఏర్పాట్లతో అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోంది. 2023లో నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ 9 ఎకరాల భూమి (4 ఎకరాలు డంపింగ్ యార్డు, 5 ఎకరాలు శ్మశానవాటిక) కేటాయించినట్లు ప్రకటించినా అది కాగితాల పైనే మిగిలిపోయింది. భౌతికంగా అట్టి స్థలాన్ని స్వాధీనం చేసుకోలేదు. స్థానికుల ఫిర్యాదుతో గతంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి శ్మశానవాటిక ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆక్రమదారులు తప్పుడు పత్రాలు చూపిస్తూ కోర్టులో కేసులు వేయడంతో సమస్య పరిష్కారం కాలేదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని అంబీర్ చెరువు పక్కన ఉన్న భూమిని ఎన్ఎంసీకి అప్పగించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

రికార్డులో సర్వే నెంబర్ 57 ప్రభుత్వ భూమి

సర్వే నెంబర్ 57 ప్రభుత్వ భూమి అని రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. కానీ ప్రస్తుతం శ్మశాన వాటిక ఉన్న స్థలం తమదే అని ఓ బడా నిర్మాణ సంస్థ క్లెయిమ్ చేస్తుంది. దీంతో రెండు దశాబ్దాలుగా అంత్యక్రియల కోసం వాడుకుంటున్న స్థలంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అడ్డుకుంటున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. అటు కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, బాచుపల్లి మండలాల సరిహద్దుల్లో ఉన్న ఈ స్థలం సమస్యను ఉన్నతాధికారులు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్వాధీనం చేసుకోవాలి



ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడ శ్మశాన వాటికను ఏర్పాటు చేసుకున్నాం. ప్రస్తుతం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి నిధులు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. అనేక సంవత్సరాలుగా స్థానిక ప్రజలు ఇదే స్థలంలో శ్మశాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రికార్డుల్లో సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిగా ఉంది. ప్రైవేట్ వ్యక్తులు తమది అనడం సరికాదు. – చల్లా సుధీర్‌రెడ్డి, ప్రగతినగర్ మాజీ ఉప సర్పంచ్

ఇతర ప్రాంతాల్లో అంత్యక్రియలు



ప్రగతినగర్ ప్రాంతంలో ఎవరైన చనిపోతే అంత్యక్రియలు చేసే పరిస్థితి ఇక్కడ లేదు. శ్మశాన వాటిక సక్రమంగా లేక, ప్రైవేట్ వ్యక్తుల జోక్యంతో గందరగోళంగా మారింది. పరిస్థితులు సక్రమంగా లేకపోవడంతో అంత్యక్రియల కోసం ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. అధికారులు వేగంగా చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలి.

– చిట్ల దివాకర్, మాజీ కార్పొరేటర్

ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు



ప్రగతినగర్ శ్మశాన వాటిక సమస్యపై కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులకు, మున్సిపల్ అధికారులకు సమస్యపై ఫిర్యాదు చేశాం. అయిన ఎలాంటి స్పందన లేదు. సర్వేల పేరిట జాప్యం చేస్తున్నారు. కానీ ప్రజల అత్యవసర పరిస్థితి మాత్రం గుర్తించడంలో అధికారులు చిత్తశుద్ధి చూపడం లేదు.

– జశ్వంత్

సర్వే తర్వాతనే సమస్య పరిష్కారం



ప్రగతినగర్ శ్మశాన వాటిక సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. అంబీర్ చెరువు సమీపంలో శ్మశ్మాన వాటిక ఉంది. అయితే ఇది ఏ మండలం రెవెన్యూ పరిధిలోకి వస్తుందో తేలాల్సి ఉంది. అటు కుత్బుల్లాపూర్, ఇటు బాచుపల్లి, మరో పక్క కూకట్‌పల్లి మండలాల ఆధ్వర్యంలో సర్వే పూర్తయితే, తరువాత ఏడీ సర్వే పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం.

– సాబేర్ అలీ, మున్సిపల్ కమిషనర్

కార్డన్‌సెర్చ్.. 150 వాహనాలు సీజ్



వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

జీడిమెట్ల: కార్డన్‌సెర్చ్ వల్ల కాలనీ ప్రజల స్థితిగతులతో పాటు ఏమైన క్రిమినల్ యాక్టివిటీస్‌ను గుర్తించవచ్చని బాలానగర్ ఏసీపీ పి.నరేష్‌రెడ్డి అన్నారు. బుధవారం జీడిమెట్ల పీఎస్ పరిధిలోని రాంరెడ్డినగర్‌లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని 1300 ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 150 వాహనాలను సీజ్ చేశారు. కాలనీ ఉన్న ఆరుగురు రౌడీషీటర్ల యాక్టివిటీ గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఉన్న రెండు బెల్ట్‌షాపులను సీజ్ చేసి 50 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 16 అక్రమ గ్యాస్ సిలిండర్లను గుర్తించారు. కార్యక్రమంలో బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ, జీడిమెట్ల, బాలానగర్ ఇన్‌స్పెక్టర్లు గడ్డం మల్లేష్, నర్సింహరాజు, మరో 13 మంది ఇన్‌స్పెక్టర్లు, 25 మంది ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది, ఎస్‌వోటీ పోలీసులు మొత్తం 260మంది పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం



రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయ ఆవరణలో ఉన్న దుర్గామాత ఆలయంలో బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. బస్తీలు, కాలనీల ప్రజలు పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా



సుభాష్‌నగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. బుధవారం దుండిగల్ మున్సిపల్ పరిధిలో జరిగిన పోషన్ బీ.. పడాయీ బీ కార్యక్రమంలో ఆమె మేడ్చల్ సీడీపీవో శారద, దుండిగల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్‌లతో కలిసి పాల్గొన్నారు. శిక్షణ పొందిన అంగన్‌వాడీలు పోషకాల ప్రాధాన్యత, ఏయే ఆహార పదార్థాల తీసుకోవాలన్న విషయాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, నాగరాణి, అశ్విని, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



వేడుకల్లో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, విశ్వకర్మ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: విరాట్ విశ్వకర్మ జయంతిని బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జగద్గిరిగుట్టలో జరిగిన విశ్వకర్మ జయంతిలో ఎంపీ ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనచారి పాల్గొన్నారు. అయోధ్యనగర్‌లోని బ్రహ్మంగారి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



అయోధ్యనగర్‌లో బ్రహ్మంగారి ఆలయంలో పూజలు చేస్తున్న కేఎం ప్రతాప్



జగద్గిరిగుట్టలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ స్వర్ణలత

దుండిగల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని కుత్బుల్లాపూర్ ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వర్ణలత అన్నారు. బుధవారం దుండిగల్‌లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, డాక్టర్ మనీషాలతో కలిసి ఆరోగ్య మహిళ– శక్తివంతమైన కుటుంబం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. స్వస్త్ నారీ– సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందిస్తామన్నారు. ఈఎన్‌టీ, మధుమేహం, రక్త పోటు, నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్ పరీక్షలను ప్రత్యేక నిపుణులతో నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవనీత, డాక్టర్ షెహనాజ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిరాజుద్దీన్, పీహెచ్ఎన్ అతీషా, హెల్త్ సూపర్‌వైజర్లు, టీబీ సూపర్‌వైజర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఉప కమిషనర్ మల్లారెడ్డి

సుభాష్‌నగర్: గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి బుధవారం తెల్లవారుజామున పలు కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గాజులరామారం డివిజన్ మహదేవపురం కాలనీలో తెల్లవారుజామున 6 గంటలకు డిప్యూటీ కమిషనర్ పర్యటించారు. కాలనీవాసులతో కలసి కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రోజువారి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాలనీ వాసులతో స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కాలనీలోని షిరిడీ సాయిబాబా మందిరంలో స్థానికులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మహాదేవపురం కాలనీ జనరల్ సెక్రటరీ ప్రసాద్, జాయింట్ సెక్రటరీలు రామచంద్రారెడ్డి, ప్రవీణ్ కుమార్, సభ్యులు శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, యాదగిరిచారి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో బూమ్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులతో మాస్టర్ కృష్ణ

కుత్బుల్లాపూర్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కుత్బుల్లాపూర్‌కు బూమ్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. బెంగళూర్ వేదిక జరిగిన కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో బూమ్స్ అకాడమీ విద్యార్థులు కాటా, కుమిటే విభాగాల్లో వివిధ వయస్సు గ్రూపుల్లో మొత్తం 26 మెడల్స్ సాధించారు. ఇందులో 10 ఫస్ట్ ప్లేస్‌లు, 9 సెకండ్ ప్లేస్, 7 థర్డ్ ప్లేస్ సాధించారు. వారిని బూమ్స్ అకాడమీ నిర్వాహకుడు మాస్టర్ కృష్ణ అభినందించారు.

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

నిజాంపేట్ : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసి నాగరాజు హాజరై నిజాంపేట్‌లోని లేబర్ అడ్డా వద్ద మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆయన నాయకత్వంలో భారత్ అనేక ప్రగతి పథకాలను ప్రారంభించి అద్భుతంగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నిజాంపేట్ అధ్యక్షులు భిక్షపతి యాదవ్, సీనియర్ నాయకులు సుబ్బారావు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, బీజేజీ బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, కార్పొరేషన్ నాయకులు సచిన్, శ్రీనివాస్‌గుప్తా, బాబుచౌదరి, ఈశ్వర్, పాండు, వెంకటేష్ ముదిరాజ్, పాండు, రాజు, హాసన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

జీడిమెట్ల: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా అపురూపా కాలనీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. 150 మంది కార్యకర్తలు చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ సంస్థకు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫేమ్ సాగర్, నాయకులు ఎం.ఎస్ వాసు, కల్యాణి, శేఖర్‌యాదవ్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



మిఠాయిలు పంపిణీ చేస్తున్న బీజేపీ శ్రేణులు

జాతీయజెండా రెపరెపలు

ఆయా పార్టీల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 వేడుకలు



గండిమైసమ్మ చౌరస్తాలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: దేశంలో హైదరాబాద్ సంస్థానం భాగమైన సందర్భంగా ఆయా పార్టీలు జాతీయ జెండాలను ఎగరవేశారు. బీజేపీ ఆధ్వర్యంలో విమోచన, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎంతో మంది అమరులయ్యారని నాయకులు అన్నారు. భూస్వాములు, పెత్తందార్లు, నిజాం పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం కొనసాగిందన్నారు. నాటి ప్రజల దుస్థితిని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా జాతీయ జెండాలను అధికారులు ఎగరవేశారు.



షాపూర్‌నగర్‌లో సీపీఎం ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్



జగద్గిరిగుట్టలో జాతీయ జెండాను ఎగురవేసిన సీపీఐ నాయకులు



గండిమైసమ్మ బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి



కొంపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేసిన కమిషనర్ కృష్ణారెడ్డి, సిబ్బంది



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఉప కమిషనర్ నరసింహ



దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో జెండా ఎగురవేసిన కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్